# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు






ప్రచురణ : జగిత్యాల | సంపుటి : 05 | సంచిక : 363 | మంగళవారం | 18 - 08 - 2026 | పేజీలు : 04 | వెల రూ. 2


## తెలంగాణ ‘సర్’ ముసాయిదా
# జాబితా విడుదల




- సర్ డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి
- 92 లక్షల మందికి నోటీసులు ఇవ్వనున్నట్లు వెల్లడి
- నోటీసులు అందుకున్నవారు సమాధానం ఇచ్చేందుకు సెప్టెంబర్ 16 తుదిగడువుం
- ముసాయిదాలో 2.64 కోట్ల మంది పేర్లు
- నోటీసులకు సెప్టెంబర్ 16 వరకు గడువు
- ఏఎస్‌డీ జాబితాలో 73 లక్షల మంది

**హైదరాబాద్ :**
తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర సవరణ ముసాయిదా ఓటరు జాబితా విడుదలైంది. ఎన్యుమరేషన్ తర్వాత రాష్ట్రంలో 78.03 శాతం ఓటర్లు ఉన్నారని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఎవరి ఓట్లయినా లేకపోయినట్లయితే ఫామ్ 6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 92 లక్షల మందికి నోటీసులు ఇస్తామని సీఈవో సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆన్‌మ్యాప్డ్ జాబితాలో ఉన్నవారికి కూడా నోటీసులు జారీ చేస్తామని వివరించారు. నోటీసులు అందుకున్నవారు సమాధానం ఇచ్చేందుకు సెప్టెంబర్ 16వ తేదీ తుదిగడువుగా పేర్కొన్నారు. 73 లక్షల మంది ఏఎస్‌డీ(అబ్సెంట్, షిఫ్టెడ్, డూప్లికేట్) లిస్ట్‌లో ఉన్నారని సుదర్శన్ రెడ్డి తెలిపారు. ‘సర్’ డ్రాఫ్ట్ జాబితాను ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఓటరు ముసాయిదా జాబితా విడుదల నేపథ్యంలో పలు రాజకీయపార్టీల ప్రతినిధులతో తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి సమావేశం అయ్యారు. ఎన్నికల కమిషన్ కార్యాలయంలో సర్ ప్రక్రియలో తదుపరి కార్యచరణపై సీఈవో సుదర్శన్ రెడ్డి చర్చలు జరిపారు. ఈ సమావేశానికి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంతో పాటు ఇతర రాజకీయ పార్టీలకు సంబంధించిన - మిగతా 2 లో

## ప్రజలను ఇబ్బంది పెడితే
# సహించేది లేదు




- 22ఏ భూములపై పొంగులేటి కీలక ఆదేశాలు
- ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరిక
- ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దని సూచన
- 22ఏలో ఉందని దరఖాస్తు తిరస్కరించొద్దని ఆదేశం



## రేవంత్ ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉంది

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు
- జాబితా నుంచి సీఎం ఇంటిని తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణ
- నిషేధిత ఆస్తుల జాబితాపై విచారణ జరిపి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
- సామాన్యుల పరిస్థితి ఏమిటన్న హరీశ్ రావు

**హైదరాబాద్ :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం కూడా నిషేధిత ఆస్తుల జాబితాలో ఉందని, దానిని ఆ జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం తెరవెనుక ప్రయత్నాలు చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి, తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని - మిగతా 2 లో

## స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే
# భారీ కుట్ర భగ్నం



- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా
- ఐఎస్ఐ అండతో పనిచేస్తున్న షాజాద్ భట్టి ఉగ్ర నెట్‌వర్క్‌ను ధ్వంసం చేశామన్న అమిత్ షా
- స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దాడుల కుట్రను భగ్నం చేశామన్న అమిత్ షా
- 14 రాష్ట్రాల్లో విస్తృతంగా ఆపరేషన్లు
- 200 మందికి పైగా ఆపరేటివ్‌లను అరెస్ట్ చేశాం
- విధ్వంసర దాడుల ప్రణాళికలను భగ్నం చేసినట్లు వెల్లడి

**ఢిల్లీ :**
ఉగ్రవాదంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. టెర్రరిజం పట్ల భారత్ ‘జీరో టాలరెన్స్’ విధానాన్ని పాటిస్తూ 14 రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలలో సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్లలో దేశ భద్రతా సంస్థలు స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే ఐఎస్ఐ మద్దతు గల, పాక్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్ర సంస్థ - మిగతా 2 లో

## ‘దిమాగీ నక్సల్ పార్టీ’.. ఒక్క రోజులోనే 1.6 లక్షల ఫాలోవర్లు!




- ‘దిమాగీ నక్సల్ పార్టీ’ పేరుతో కొత్త ఇన్‌స్టాగ్రామ్ ఖాతా
- 24 గంటల్లోనే 1.6 లక్షలకు పైగా ఫాలోవర్లు
- ఖాతాలో ప్రస్తుతం 62 పోస్టులు
- ఖాతాను ఎవరు నిర్వహిస్తున్నారో లేని స్పష్టత
- ఈ నెలలోనే ప్రారంభమైన అకౌంట్

**ఢిల్లీ :**
ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రస్తావించిన ‘దిమాగీ నక్సల్’ పదం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఇదే పేరుతో ఓ కొత్త ఇన్‌స్టాగ్రామ్ ఖాతా వెలుగులోకి వచ్చింది. ఖాతా ప్రారంభించిన 24 గంటల్లోనే 1.6 లక్షలకు పైగా ఫాలోవర్లు చేరడం ఆసక్తికరంగా మారింది. ‘దిమాగీ నక్సల్ పార్టీ’ పేరుతో ఉన్న ఈ ఖాతాలో 62 పోస్టులు ఉన్నాయి. దాదాపు 35 ఖాతాలను ఫాలో అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లోని వివరాల ప్రకారం ఈ నెలలోనే ఖాతా తెరిచారు. ఇప్పటివరకు ఒకసారి యూజర్ నేమ్‌ను మార్చినట్లు సమాచారం ఉంది. అయితే ఈ ఖాతాను ఎవరు నిర్వహిస్తున్నారనే వివరాలు మాత్రం వెల్లడికాలేదు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో - మిగతా 2 లో




## యూపీలో 4 నెలల్లో 22 మందికి మరణశిక్ష!

- యూపీలో ఓ జడ్జి నాలుగు నెలల్లో 22 మందికి ఉరిశిక్ష విధించిన జడ్జి
- ముజఫర్‌నగర్ అదనపు సెషన్స్ జడ్జి రవికుమార్ తీర్పులు
- న్యాయవాది హత్య, దోపిడీ వంటి 10 తీవ్రమైన కేసుల్లో ఈ శిక్షలు ఖరారు

## బీజేపీ కొత్త టీమ్‌లో ఏపీకి 3 పదవులు.. తెలంగాణకు నో ప్లేస్!

- బీజేపీ కొత్త జాతీయ టీమ్‌ను ప్రకటించిన నితిన్ నబిన్
- ఏపీ నుంచి ముగ్గురికి కీలక పదవులు
- పురందేశ్వరి, రామ్ మాధవ్‌కు ఉపాధ్యక్ష పదవులు
- విష్ణువర్ధన్ రెడ్డికి జాయింట్ కో–ఆర్డినేటర్ బాధ్యత
- స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి



**ఢిల్లీ :**
బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కొత్త జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురికి కీలక బాధ్యతలు దక్కాయి. డి. పురందేశ్వరి, రామ్ మాధవ్‌కు జాతీయ ఉపాధ్యక్ష పదవులు వరించాయి. విష్ణువర్ధన్ రెడ్డికి జాయింట్ కో–ఆర్డినేటర్ బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో తెలంగాణ - మిగతా 2 లో




## 50 మందిపై ఎన్టీఏ వేటు

- కీలక స్థానాల్లో నూతన నియామకాలు
- పరీక్షల వివాదాలతో ఎన్టీఏలో భారీ ప్రక్షాళన
- 50 మందికి పైగా సిబ్బందిని తొలగించిన కేంద్రం
- కీలక పోస్టుల్లోకి కొత్త నిపుణుల నియామకం
- పరీక్షా విధానంలో కఠిన నిబంధనలు అమలుకు ఆదేశం

## టీచర్ల సస్పెన్షన్‌పై
# వైఎస్ జగన్ ఫైర్!



- టెట్ నుంచి మినహాయింపు కోరిన ఐదుగురు టీచర్లను సస్పెండ్ చేశారన్న జగన్
- చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం
- ఇది కక్ష సాధింపు చర్యేనని సోషల్ మీడియాలో విమర్శలు
- సస్పెన్షన్లు ఎత్తివేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్
- టీచర్లకు న్యాయపరంగా అండగా ఉంటామని హామీ

**అమరావతి :**
ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయింపు కోరుతూ కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులను కలిసిన - మిగతా 2 లో

## అసెంబ్లీకి రండి
# డీఎస్సీపై చర్చిద్దాం

- వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు సవాల్
- మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు భర్తీ చేశాం
- చరిత్రలో తొలిసారి 148 రోజుల్లోనే మెగా డీఎస్సీ ప్రక్రియ పూర్తి
- పారదర్శకంగా, అవకతవకలకు ఆస్కారం లేకుండా పోస్టులు భర్తీ చేశామన్న చంద్రబాబు



**అమరావతి :**
ప్రపంచంలో అధిక తలసరి ఆదాయం గల జాతి తెలుగుజాతి అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. విద్య విషయంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదన్నారు. గురుకుల పాఠశాలల నూతన విధానం తీసుకొచ్చింది ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. ఈరోజు దేశవ్యాప్తంగా రెసిడెన్షియల్ స్కూల్స్ వచ్చాయని తెలిపారు. డీఎస్సీ నియామకాల అంశంపై అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. ‘దేశంలో తొలిసారి మహిళా విశ్వవిద్యాలయాన్ని ఎన్టీఆర్ ఏర్పాటు చేశారు. గతంలో రంగారెడ్డి జిల్లాలో - మిగతా 2 లో

## ప్రజానాడి



# సంపాదకీయం


## ఆదాయం మూరెడు.. ఖర్చులు బారెడు

(హెచ్. ప్రతాప్)




ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతోంది. ఆదాయాలు కూడా పెరుగుతున్నాయి. కానీ సాధారణ కుటుంబం నెలాఖరులో మిగుల్చుకోగలిగే మొత్తం మాత్రం పెరుగుతోందా? ఈ ప్రశ్నకు సమాధానం అంత సంతృప్తికరంగా లేదు. భారత్‌లో జీవన వ్యయం పెరుగుదల ఇప్పుడు కేవలం ద్రవ్యోల్బణ గణాంకాలకు పరిమితమైన అంశం కాదు. పేదలు, దిగువ మధ్యతరగతి, వేతన జీవులు, స్థిర ఆదాయాలపై ఆధారపడే కుటుంబాల ఆర్థిక భద్రతను ప్రభావితం చేస్తున్న ప్రధాన సవాలుగా మారుతోంది.2026 జూలైలో దేశ రిటైల్ ద్రవ్యోల్బణం 4.45 శాతంగా నమోదైంది. ఆహార ద్రవ్యోల్బణం 5.52 శాతానికి చేరింది. గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్ ద్రవ్యోల్బణం 4.84 శాతంగా ఉండటం, తక్కువ ఆదాయ వర్గాలపై ధరల ఒత్తిడి ఎంత ఎక్కువగా ఉంటుందో సూచిస్తోంది. వేతనం పెరిగినా ఆదాయంలో గణనీయమైన భాగం ఆహారం, ఇంధనం, రవాణా వంటి ప్రాథమిక అవసరాలకే ఖర్చవుతుంది.అయితే కుటుంబ బడ్జెట్‌పై ఒత్తిడి ఆహార ధరలతోనే ముగియడం లేదు. ప్రైవేట్ విద్య ఖర్చులు, పాఠశాల ఫీజులు, పుస్తకాలు, డిజిటల్ విద్యా సాధనాలు, ఉన్నత విద్య కోసం ట్యూషన్ మరియు వసతి వ్యయాలు వేగంగా పెరుగుతున్నాయి. ఆరోగ్య రంగంలో వైద్య పరీక్షలు, ఆసుపత్రి సేవలు, మందులు, ఆరోగ్య బీమా ప్రీమియంలు కుటుంబాలపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. అదే సమయంలో ఇంధనం, ప్రజా రవాణా, వ్యక్తిగత వాహనాల నిర్వహణ వ్యయాలు పెరగడం వల్ల ఉద్యోగానికి వెళ్లడం కూడా ఖరీదైన వ్యవహారంగా మారుతోంది.ఇక్కడ ఒక కీలకమైన ప్రశ్న ముందుకు వస్తోంది---ద్రవ్యోల్బణాన్ని భర్తీ చేయడానికి జీతాల్లో పెరుగుతున్న డియర్‌నెస్ అలవెన్స్ లేదా ఇతర భత్యాల పెంపు వాస్తవ జీవన వ్యయాన్ని నిజంగా భర్తీ చేస్తున్నాయా? కాగితంపై వేతనం పెరిగినా, ఆ పెరుగుదల ఆహారం, విద్య, ఆరోగ్యం, రవాణా, గృహ వ్యయాల పెరుగుదల కంటే తక్కువగా ఉంటే వాస్తవ కొనుగోలు శక్తి పెరగదు. ముఖ్యంగా స్థిర ఆదాయాలపై ఆధారపడే కుటుంబాలు ఈ ఒత్తిడిని మరింత తీవ్రంగా అనుభవిస్తాయి.దీని ప్రభావం కేవలం ప్రస్తుత వినియోగంపైనే కాదు. కుటుంబాలు పొదుపులను తగ్గించడం, పెట్టుబడులను వాయిదా వేయడం, ఆరోగ్యం లేదా విద్యపై ఖర్చులను తగ్గించడం వంటి నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తే, దీర్ఘకాలంలో మానవ మూలధనం మరియు ఆర్థిక భద్రత రెండూ దెబ్బతింటాయి.అందువల్ల జీవన వ్యయాన్ని నియంత్రించడం అంటే కేవలం ద్రవ్యోల్బణాన్ని ఒక నిర్దిష్ట శాతంలో ఉంచడం కాదు. నాణ్యమైన ప్రభుత్వ విద్య, అందుబాటు ధరలో ఆరోగ్య సేవలు, సమర్థవంతమైన ప్రజా రవాణా, చవకైన గృహ వసతి, బలమైన ఆహార సరఫరా వ్యవస్థ వంటి అంశాలను కూడా ఆర్థిక విధానంలో కేంద్రంగా చూడాలి.దేశ ఆర్థిక వృద్ధి నిజమైన ప్రజా శ్రేయస్సుగా మారేది ఆదాయం పెరిగినప్పుడు మాత్రమే కాదు; పెరిగిన ఆదాయంతో కుటుంబం మెరుగైన జీవితం, భద్రమైన భవిష్యత్తు, కొంత పొదుపు---ఈ మూడింటినీ సాధించగలిగినప్పుడే

# అసెంబ్లీకి రండి డీఎస్సీపై చర్చిద్దాం



**మొదటిపేజీ తరువాయి -** ప్రభుత్వ పాఠశాలలు కూడా సరిగా లేవు. పాఠశాలలతో పాటు మండలానికి ఒక కాలేజీ ఏర్పాటు విధానం తెచ్చాం. డివిజన్‌కు ఒక ఇంజినీరింగ్ కళాశాల, జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ విధానం తెచ్చాం. రంగారెడ్డి జిల్లాలో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలు దేశంలో ఎక్కడా లేవు. అధిక తలసరి ఆదాయం గల జిల్లాకు చిరునామాగా రంగారెడ్డి జిల్లా మారిందని' చంద్రబాబు వెల్లడించారు."1995 నుంచి 2025 వరకు 14 డీఎస్సీల్లో 11 నేనే నిర్వహించా. పాఠశాలల్లో 80 శాతం నేను నిర్వహించిన డీఎస్సీల్లో ఎంపికైన ఉపాధ్యాయులే. ఒక్కరు కూడా ఎప్పుడూ అవినీతి జరిగిందని చెప్పిన సందర్భమే లేదు. పనితనం మేరకు కౌన్సెలింగ్ విధానంలో టీచర్ల బదిలీలు చేపట్టాం. రాజకీయ నాయకుల వద్దకు ఉపాధ్యాయులు వెళ్లే పనిలేకుండా చేశాం. 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లలకు రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయడమే లక్ష్యం. లక్ష మంది పిల్లలు ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడులకు రావడం చరిత్ర. 1996లో ఆడపిల్లలకు కాలేజీలు, ఉద్యోగాల్లో 33 శాతం సీట్లు ఇప్పించాం. వరకట్నాలు పోయి రివర్స్ కట్నం అడిగే పరిస్థితి వచ్చింది. రాష్ట్రంలో తొలిసారి మధ్యాహ్న భోజనం ప్రవేశపెట్టింది తెలుగుదేశం పార్టీ. ఇంటర్ కళాశాలల విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం.మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు భర్తీ చేశామని చంద్రబాబు పేర్కొన్నారు. చరిత్రలో తొలిసారి 148 రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తైందని చెప్పారు. పారదర్శకంగా, అవకతవకలకు ఆస్కారం లేకుండా పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. ఎంపికైన టీచర్లను కుటుంబసభ్యులు సహా అమరావతికి పిలిచి సన్మానం చేశామన్నారు. ఇప్పుడు మెగా డీఎస్సీపై వైఎస్సార్సీపీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంపై కుట్రలు పన్నేవాళ్లు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.'మెగా డీఎస్సీకి సంబంధించిన ప్రతి అంశాన్నీ ప్రజలకు అందుబాటులో ఉంచాం. ఎన్డీయే విశ్వసనీయతను దెబ్బతీయాలంటే మీ తరం కాదు ఖబడ్దార్. మేం ఏదీ దాచిపెట్టలేదు. ఆన్సర్ కీ, మెరిట్ లిస్ట్, సెలక్షన్ లిస్ట్‌లను ప్రజలకు అందుబాటులో ఉంచాం. చదువుకున్న వారిని ఆత్మవిమానం దెబ్బతీసే విధంగా చేస్తున్న వ్యాఖ్యలు సరికావు. కూలీల చేత ధర్నాలు చేయించడం ఏం పద్ధతి ఎంతో పారదర్శకంగా ఈ నియామక పరీక్షను నిర్వహించిన తీరు మిగిలిన వారికి కూడా ఆదర్శంగా ఉంది. కేంద్రం అనుసరించిన వైఖరినే స్పోర్ట్స్ కోటా భర్తీలో మేం అనుసరించామని' చంద్రబాబు పేర్కొన్నారు."ఒక రాజకీయపక్షం రెండున్నరేళ్లుగా అసెంబ్లీకి రాకుండా జీతం తీసుకోవడం ప్రివిలైజర్స్ అందుకోవడం ఏ రకంగా సమర్థనీయం శాసనసభకు రాకుండా బాధ్యత కలిగిన వ్యక్తులుగా వారిని ఎలా చూస్తాం. డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న ప్రతిపక్షం సభకు వచ్చి ప్రశ్నిస్తే సమాధానం చెప్పడానికి మేం సిద్ధంగా ఉన్నాం. ఇదే విషయాన్ని పదేపదే చెప్తున్నా వారు సభకు రావడం లేదు. వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలకు ధైర్యముంటే దీనిపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని సవాల్ చేస్తున్నా." - చంద్రబాబు, ముఖ్యమంత్రివైఎస్సార్సీపీ హిట్ అండ్ రన్ పార్టీ అసెంబ్లీకి వస్తే అడ్డంగా దొరికిపోతారని చంద్రబాబు అన్నారు. డీఎస్సీ అభ్యర్థులకు వారి కష్టంతో ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. ఉద్యోగాలు వచ్చిన టీచర్లు ధైర్యంగా ఉండాలన్నారు. కుట్రలను ఎదుర్కొనే శక్తి ప్రభుత్వానికి ఉందని చెప్పారు. తాను ఈ సీటులో కూర్చున్నంత వరకు ఎవరైనా తప్పు చేస్తే అదే చివరి రోజని చంద్రబాబు వ్యాఖ్యానించారు.అంతకుముందు ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీ లాబీలో మీడియాతో మాట్లాడారు. 50 ఏళ్ల తన రాజకీయ జీవితంలో గ్రూప్-1 లాంటి స్కాం చూడలేదన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన గ్రూప్-1 స్కాంపై శాసనసభలో బుధవారం నాడు అన్ని వాస్తవాలు బయటపెడతామని స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీ స్వార్థానికి ఎందరో నిరుద్యోగులు బలయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెగా-డీఎస్సీ అభ్యర్థులు ఆత్మాభిమానంతోనే రోడ్డెక్కారని చెప్పారు. డీఎస్సీ నియామకాల్లో 50 శాతం పైగా మహిళలే ఉన్నారని, డీఎస్సీతో వారికి ఎంతో ఎమోషనల్ బాండింగ్ ఉందని పేర్కొన్నారు. అందుకే వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుంటే ఎలా సహించగలరని చంద్రబాబు ప్రశ్నించారు.

## టీచర్ల సస్పెన్షన్‌పై వైఎస్ జగన్ ఫైర్!

**మొదటిపేజీ తరువాయి -** ఐదుగురు టీచర్లను సస్పెండ్ చేశారంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా ఉపాధ్యాయులపై ముఖ్యమంత్రి చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ నేడు సోషల్ మీడియా వేదికగా ధ్వజమెత్తారు."మొదటి రోజు వైఎస్సార్ కడప జిల్లా టీచర్ల సంఘం వారిని, రెండో రోజు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల టీచర్లను సస్పెండ్ చేశారు. ఆ ఐదుగురు ఉపాధ్యాయులను ఎందుకు సస్పెండ్ చేశారు? వారు చేసిన నేరం ఏమిటి?" అని జగన్ సూటిగా ప్రశ్నించారు. సర్వీసులో చేరినప్పుడు లేని టెట్ నిబంధనను ఇప్పుడు అమలు చేయడంతో లక్ష మందికి పైగా సీనియర్ టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నిబంధన నుంచి మినహాయింపు కోరుతూ తమకు అండగా నిలిచిన ఎంపీల సహకారంతో కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వడం నేరమా? అని జగన్ నిలదీశారు.తక్షణమే ఉపాధ్యాయుల సస్పెన్షన్లను రద్దు చేసి, వారికి ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు. ఈ అన్యాయమైన సస్పెన్షన్లపై న్యాయపోరాటంలో టీచర్లకు వైసీపీ పూర్తి అండగా ఉంటుందని పేర్కొన్నారు. "మీ రెడ్ బుక్ అరాచక పాలన ఇప్పుడు ప్రభుత్వ ఉపాధ్యాయులను కూడా వదలడం లేదు. చంద్రబాబు గారూ.. నిజానికి మీరే కేంద్ర ప్రభుత్వాన్ని ఈ టెట్ నిబంధనను తొలగించాలని కోరాలి కదా? ఎన్డీఏలో భాగస్వామిగా ఉండి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదు?" అని జగన్ విమర్శించారు."మీరు చేయాల్సిన పని చేయలేదు. సీనియర్ టీచర్ల సమస్యలను గాలికొదిలేశారు. మా పార్టీ ఎంపీల మద్దతుతో వారు తమ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తే, దానికి రాజకీయ రంగు పులిమి సస్పెండ్ చేశారు. మీరు చేయలేని పనిని వారు చేయడానికి ప్రయత్నించడమే వారి తప్పా? ఒక సమస్యను పరిష్కరించాల్సింది పోయి, దానికి రాజకీయ దురుద్దేశాలు ఆపాదించడం దారుణం. ఇంతగా ఎలా దిగజారిపోయారు?" అని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఉద్యోగులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ చంద్రబాబు గాలికొదిలేశారని జగన్ ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి మూడో ఏడాది నడుస్తున్నా మధ్యంతర భృతి (ఐఆర్), పీఆర్సీ హామీలు నెరవేర్చలేదని, ఐదు డీఏలు పెండింగ్‌లోనే ఉన్నాయని గుర్తుచేశారు. "చంద్రబాబు గారూ.. అధికార అహంకారంతో మీరు వ్యవహరిస్తున్న తీరును, మీ నియంతృత్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారు. చివరకు మీ నీడను చూసి కూడా మీరు సహించలేని స్థాయికి చేరుకున్నారు" అని జగన్ విమర్శించారు.

## బీజేపీ కొత్త టీమ్‌లో ఏపీకి 3 కీలక పదవులు.. తెలంగాణకు నో ప్లేస్!



**మొదటిపేజీ తరువాయి -** నుంచి ఒక్కరికి కూడా జాతీయ టీమ్‌లో చోటు దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది.కొత్త కార్యవర్గంలో కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాలకు చెందిన నేతలకు ప్రాధాన్యం ఇచ్చారు. రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే, ఒడిశాకు చెందిన బైజయంత్ పాండా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రేఖా వర్మ, తారిఖ్ మన్సూర్ జాతీయ ఉపాధ్యక్షులుగా కొనసాగనున్నారు. ఉత్తరాఖండ్ మాజీ సీఎం తీరత్ సింగ్ రావత్, పంజాబ్‌కు చెందిన మన్‌ప్రీత్ సింగ్ బాదల్ సహా పలువురికి ఇదే బాధ్యతలు అప్పగించారు. 13 మంది జాతీయ ఉపాధ్యక్షుల్లో మహిళలకు గణనీయమైన ప్రాతినిధ్యం కల్పించారు.మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి దక్కింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆమెకు లభించిన తొలి కీలక సంస్థాగత బాధ్యత ఇదే. వినోద్ తావ్డే, సునీల్ బన్సల్, బిప్లవ్ కుమార్ దేవ్ సహా పలువురు ప్రధాన కార్యదర్శులుగా కొనసాగనున్నారు. వసుంధర రాజే, స్మృతి ఇరానీ మళ్లీ కీలక సంస్థాగత పదవుల్లోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.బీఎల్ సంతోష్ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత)గా కొనసాగనున్నారు. శివప్రకాశ్, సౌదాన్ సింగ్ సంయుక్త ప్రధాన కార్యదర్శులు (సంస్థాగత)గా బాధ్యతలు చేపట్టనున్నారు. పీయూష్ గోయల్‌కు జాతీయ కోశాధికారి పదవి ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాల సమన్వయకర్తగా సంబిత్ పాత్రను నియమించారు. పార్టీ మీడియా వ్యవహారాలను అనిల్ బలూనీ చూసుకోనున్నారు.తెలంగాణకు మాత్రం ఈసారి జాతీయ కార్యవర్గంలో ప్రాతినిధ్యం దక్కలేదు. గతంలో డీకే అరుణ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా లక్ష్మణ్ బాధ్యతలు నిర్వహించారు. కొత్త టీమ్‌లో ఇద్దరికీ చోటు దక్కలేదు. తెలంగాణలో పార్టీని మరింత విస్తరించడమే తదుపరి లక్ష్యమని బీజేపీ చెబుతున్న సమయంలో.. జాతీయ స్థాయి పదవుల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం లేకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది.

# స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే భారీ కుట్ర భగ్నం

**మొదటిపేజీ తరువాయి -** షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను నాశనం చేసినట్లు వెల్లడించారు. షహజాద్ భట్టి నెట్‌వర్క్‌కు చెందిన 200 మందికి పైగా ఆపరేటివ్‌లను అరెస్టు చేశామని పేర్కొన్నారు. తద్వారా విధ్వంసకర దాడుల ప్రణాళికలను భగ్నం చేశామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో అమిత్ షా పోస్ట్ పెట్టారు."దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు మోదీ సర్కార్ 200 మందికి పైగా షహజాద్ భట్టి నెట్‌వర్క్ ఆపరేటివ్‌లను అరెస్టు చేసింది. ఈ క్రమంలో ఐఎస్ఐ మద్దతుగల ఉగ్ర సంస్థ షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను నాశనం చేసింది. విధ్వంసక దాడులకు షహజాద్ భట్టి నెట్‌వర్క్ వేసిన ప్రణాళికలను భగ్నం చేసింది. ఉగ్రవాదం పట్ల భారత్‌కు ఉన్న జీరో టాలరెన్స్‌కు ఇదొక అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తుంది. భారత భద్రతా దళాలు 14 రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలలో సమన్వయంతో కూడిన ఆపరేషన్లను ప్రారంభించి షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను చిన్నాభిన్నం చేశాయి. ఐఎస్ఐ నిధులతో నడిచే ఈ సంస్థ నుంచి ఐఈడీలు, పాక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులున్న గ్రెనేడ్లు, పిస్టల్స్, తూటాలు, గూఢచర్యానికి ఉపయోగించే సీసీటీవీ కెమెరాలతో సహా భారీ మొత్తంలో సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. షహజాద్ భట్టి నెట్‌వర్క్ అనేక ఉగ్రవాద కార్యకలాపాలలో పాలుపంచుకుంది" అని అమిత్ షా పేర్కొన్నారు. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఐఎస్ఐ మద్దతు గల ఉగ్ర సంస్థ షహజాద్ భట్టి నెట్‌వర్క్‌కు దేశంలో జరిగిన గ్రనేడ్, ఐఈడీ, పెట్రోల్ బాంబు దాడులు, లక్షిత హత్యలతో సంబంధం ఉంది. పోలీసులు, రక్షణ, మతపరమైన ప్రదేశాల్లో రెక్కీ నిర్వహించడానికి, గూఢచర్యం కోసం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి స్థానిక మధ్యవర్తులకు ఈ నెట్‌వర్క్ డబ్బు ఇస్తోంది. చట్టవిరుద్ధ కార్యక లాపాల నివారణ (ఉపా) చట్టం, భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద షహజాద్ భట్టి గ్యాంగ్‌పై 80కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. సీమాంతర ఉగ్రవాదం పట్ల దేశ జీరో టాలరెన్స్ విధానంలో భాగంగా 14 రాష్ట్రాల్లో ఈ నెట్‌వర్క్‌కు చెందిన 253 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ (62), హరియాణా (52), ఢిల్లీ (51), పంజాబ్ (44), రాజస్థాన్ (15), మహారాష్ట్ర (8), ఉత్తరాఖండ్ (5), కర్ణాటక, గుజరాత్, బిహార్‌లో చెరో ముగ్గురు, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, కేరళలో చెరో ఇద్దరు భట్టి నెట్‌వర్క్ ఆపరేటివ్‌లను అరెస్ట్ చేశారు.పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాది షహజాద్ భట్టికి సంబంధించిన మూడు ఉగ్రవాద గ్యాంగ్‌స్టర్ నెట్‌వర్క్ కేసులకు సంబంధించి ఎన్ఐఏ ఇటీవలే పంజాబ్, హరియాణాలలో 18 చోట్ల సోదాలు చేపట్టింది. ఉగ్ర కార్యకలాపాలపై సమాచారాన్ని సేకరించేందుకు కొంత మందిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టింది. ఈ మూడు కేసుల్లో ఎన్ఐఏ నిఘాలో ఉన్న వ్యక్తుల కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, ఆర్థిక లావాదేవీలు, కార్యకలాపాలకు సంబంధించిన సమాచారంతో పాటు, పలు డిజిటల్ డివైజ్‌లు, పత్రాలను కూడా ఎన్ఐఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సరిహద్దుల అవతల జరుగుతున్న భారీ కుట్రను ఛేదించేందుకు సోదాల సమయంలో సేకరించిన సమాచారం, సాక్ష్యాలను ఫోరెన్సిక్, సాంకేతిక పరీక్షల కోసం పంపారు. గ్యాంగ్‌స్టర్ నుంచి ఉగ్రవాదిగా మారిన షహజాద్ భట్టి నడుపుతున్న నెట్‌వర్క్ వెనుక ఉన్న భారీ కుట్రను ఛేదించే లక్ష్యం తో సాగుతున్న దర్యాప్తులో భాగంగా తదుపరి విచారణ కోసం కొం దరు వ్యక్తులకు నోటీసులు జారీ చేసినట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు.

## తెలంగాణ 'సర్' ముసాయిదా జాబితా విడుదల

**మొదటిపేజీ తరువాయి -** నాయకులు హాజరయ్యారు. సర్ ప్రక్రియలో పార్టీలు చేపట్టాల్సిన తదుపరి కార్యచరణపై సుదర్శన్ రెడ్డి వారికి దిశానిర్దేశం చేశారు.సర్‌లో భాగంగా ఇవాళ్టి నుంచి నోటీసుల జారీ, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 92 లక్షల మంది ఓటర్లకు నోటీసులు ఇవ్వనున్నారు. ఎన్యుమరేషన్ పత్రాలు ఇచ్చిన వారిలో సుమారు 32. 36 లక్షల మంది గత 2002 ఎస్ఐఆర్ వివరాలను ప్రస్తావించలేదు. గత ఎస్ఐఆర్‌లో తమ వివరాలు లేదా కుటుంబ సభ్యుల వివరాలను పేర్కొనలేదు. అన్‌మ్యాపింగ్ ఓటర్లుగా పేర్కొంటూ వారందరికీ ఎన్నికల కమిషన్ నోటీసులు రానున్నాయి. మరో 61 లక్షల మంది ఎన్యూమరేషన్ ఫారాల్లో 2002 ఎస్ఐఆర్ వివరాలు ప్రస్తావించినప్పటికీ, అసంబద్ధంగా ఉన్నాయి. అలాంటి వాటిని 'అనామలిస్' ఓటర్లుగా పేర్కొంటూ వారికి కూడా నోటీసులు ఇచ్చేందుకు సీఈవో కార్యాలయం జాబితాను సిద్ధం చేసింది. ఇవాళ్టి నుంచి సెప్టెంబర్ 17 వరకు నెల రోజుల పాటు ఓటర్ల వివరణలు, అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరించనున్నారని తెలిసింది. అక్టోబర్ 19వ తేదీన తుది ఓటరు జాబితాను అధికారులు ప్రకటిస్తారు.

## ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదు



**మొదటిపేజీ తరువాయి -** 22ఏ నిషేధిత భూముల జాబితాలో ప్రైవేటు భూములు చేరుతున్న అంశంపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. 22ఏను అడ్డుపెట్టుకుని ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని స్పష్టం చేశారు. దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. 22ఏ జాబితాలో భూమి ఉందనే కారణంతోనే దరఖాస్తును తిరస్కరించవద్దని మంత్రి సూచించారు. అసలు ఆ భూమి నిషేధిత జాబితాలోకి ఎలా వచ్చిందో పరిశీలించాలని చెప్పారు. సంబంధిత రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిజమైన భూ హక్కుదారులకు న్యాయం చేస్తూనే ప్రభుత్వ భూములను కాపాడాలని సూచించారు.నిషేధిత భూముల అంశంపై రాష్ట్ర సచివాలయంలో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సబ్ రిజిస్ట్రార్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులు, ఫిర్యాదులపై అధికారులను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు.భూ సమస్యలపై ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసేందుకు త్వరలో టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. 22ఏ భూముల విషయంలో నిబంధనల పేరుతో ప్రజలకు అనవసర ఇబ్బందులు కలిగించకుండా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు.

## రేవంత్ ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉంది



**మొదటిపేజీ తరువాయి -** ఆయన డిమాండ్ చేశారు.సోమవారం హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి నివాసానికే ఈ పరిస్థితి ఎదురైతే, ఇక సామాన్య ప్రజల గతి ఏమిటి?" అని ప్రశ్నించారు. అసలు ఏ ప్రాతిపదికన ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చారో విచారణ జరపాలని, ఆ జాబితాలో ఉన్న ఆస్తుల పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం స్పష్టమైన కాలపరిమితిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాకు సంబంధించి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం రావడం లేదని ఆయన విమర్శించారు.

## కోనసీమలో కలకలం ఈ నెల 3న చేపల వేటకు వెళ్లి తిరిగిరాని మత్స్యకారులు

### ఈ నెల 13 నాటికే తిరిగి రావాల్సిన మత్స్యకారులు

### ఫోన్లలో కూడా వారిని సంప్రదించేందుకు వీలుకాని వైనం

### అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం

చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు తిరిగిరాకపోవడంతో కోనసీమ జిల్లాలో తీవ్ర కలకలం రేగింది. అల్లవరం మండలం ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు చెందిన బోటులో ఈ నెల 3న ఎనిమిది మంది మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లారని, నిర్ణీత గడువు ప్రకారం ఈ నెల 13 నాటికే తిరిగి రావాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఒడ్డుకు చేరలేదని జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్ తెలిపారు.మత్స్యకారుల వద్ద 15 రోజులకు సరిపడా రేషన్ నిల్వలు, 1,000 లీటర్ల డీజిల్ మాత్రమే ఉంది. ఈ పరిస్థితుల్లో ఫోన్లలో కూడా వారిని సంప్రదించేందుకు వీలుకాకపోవడంతో జిల్లా యంత్రాంగం అత్యంత అప్రమత్తమైంది. బోటు విశాఖపట్నం నుంచి ఒడిశాలోని పారాదీప్ తీర ప్రాంతాల వైపు వెళ్లి ఉండవచ్చని భావిస్తున్నారు.బంగాళాఖాతంలో అల్పపీడన పరిస్థితులు ఉన్న నేపథ్యంలో, పరిస్థితి తీవ్రతను గమనించిన జిల్లా కలెక్టర్ తక్షణమే ఇండియన్ కోస్ట్‌గార్డ్‌తో పాటు జిల్లా ఎస్పీ రాహుల్ మీనాతో సమన్వయం చేసుకుని సముద్రంలో విస్తృత గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బోటు యజమాని, బాధిత కుటుంబాల వివరాలను సేకరించి కోస్ట్‌గార్డ్‌కు అందించినట్లు అధికారులు తెలిపారు. తీర ప్రాంతంలో తమ వారి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనతో ఎదురుచూస్తున్నారు.

## 50 మందిపై ఎన్టీఏ వేటు.. కీలక స్థానాల్లో నూతన నియామకాలు

**మొదటిపేజీ తరువాయి -** పరీక్ష లీకేజీ నేపథ్యంలో 50 మందికి పైగా సిబ్బందిని తొలగించిన జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్టీఏ), కీలకమైన నాయకత్వ స్థానాల్లో నిపుణులను నియమిస్తోంది. ఇటీవల నీట్-యూజీ 2026 పేపర్ లీక్ ఆరోపణలు, యూజీసీ-నెట్ పరీక్షల్లో తలెత్తిన వివాదాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర విద్యాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి, ఎన్టీఏ డైరెక్టర్ జనరల్‌తో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్, చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఐఎస్ఓ) వంటి 10 కీలకమైన పదవుల భర్తీకి నియామక ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించింది.సైబర్ సెక్యూరిటీ, సైకోమెట్రిక్స్, ప్రశ్నపత్రాల రూపకల్పన వంటి విభాగాల్లో ప్రైవేట్ రంగ నిపుణులను కూడా నియమించుకుంటున్నట్లు మంత్రిత్వ శాఖ పేర్కొంది. పరీక్షల నిర్వహణలో నిర్దేశిత నిబంధనలను అత్యంత కఠినంగా పాటించాలని కేంద్రమంత్రి అధికారులను ఆదేశించారు.రహస్య కార్యకలాపాల వ్యవస్థను, ముఖ్యంగా స్ట్రాంగ్ రూమ్‌లు, ఎయిర్-గ్యాప్డ్ సిస్టమ్స్ వంటి భద్రతా ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తిగా ఆధునికీకరించాలని సూచించారు. అన్ని పరీక్షా ప్రక్రియలపై పూర్తిస్థాయి ఆడిట్ నిర్వహించి, చేపట్టిన దిద్దుబాటు చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఎన్టీఏను ఆదేశించారు.

## 'దిమాగీ నక్సల్ పార్టీ'.. ఒక్క రోజులోనే 1.6 లక్షల ఫాలోవర్లు!

**మొదటిపేజీ తరువాయి -** ప్రధాని మోదీ 'దిమాగీ నక్సల్' అనే పదాన్ని ఉపయోగించారు. మావోయిస్టులపై పోరులో సాధించిన విజయాలను ప్రస్తావించిన ఆయన.. అడవుల్లో సాయుధ నక్సలిజాన్ని అణిచివేయగలిగామని చెప్పారు. అయితే సాయుధ నక్సల్స్ తగ్గిపోయినా.. 'దిమాగీ నక్సల్స్' ఇంకా ఉన్నారని వ్యాఖ్యానించారు.మోదీ చేసిన ఈ వ్యాఖ్యల తర్వాత అదే పేరుతో ఇన్‌స్టాగ్రామ్ ఖాతా వెలుగులోకి రావడం ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తి రేపుతోంది. అయితే ఖాతా వెనుక ఎవరున్నారు? దాని ఉద్దేశం ఏంటి? అనే విషయాలు మాత్రం స్పష్టంగా తెలియలేదు.

# 4 నెలల్లో 22 మందికి మరణశిక్ష!

**మొదటిపేజీ తరువాయి -** ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌కు చెందిన అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కేవలం నాలుగు నెలల కాలంలోనే 10 వేర్వేరు కేసుల్లో 22 మందికి మరణశిక్ష విధించి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. ఈ వరుస తీర్పుల నేపథ్యంలో దేశంలో మరణశిక్షల అమలుపై మరోసారి విస్తృత చర్చ ప్రారంభమైంది.ప్రభుత్వ న్యాయవాది వెల్లడించిన వివరాల ప్రకారం, జడ్జి రవికుమార్ దివాకర్ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో ఈ కీలక తీర్పులను వెలువరించారు. న్యాయవాది సమీర్ సఫీ హత్య కేసు, హోంగార్డు హత్య, హైవే దోపిడీ, ఆర్థిక లాభం కోసం కిడ్నాప్ చేసి హత్య చేయడం వంటి అత్యంత క్రూరమైన నేరాల్లో నిందితులకు ఈ కఠిన శిక్షలు ఖరారు చేశారు. ఇందులో భాగంగా ఏప్రిల్‌లో ఏడుగురికి, మే నెలలో ఒకరికి, జూన్‌లో ఇద్దరికి, జూలైలో ఏడుగురికి, ఆగస్టు 13 నాటికి మరో ఐదుగురికి మరణశిక్ష విధించారు.ఇటీవల ఆగస్టు 12న, 1999 నాటి కిడ్నాప్, హత్య కేసులో షానవాజ్‌కు, ఆగస్టు 13న షామ్లీ జిల్లాలో జరిగిన పవన్ కుమార్ హత్య కేసులో నలుగురికి ఉరిశిక్ష విధిస్తూ ఆయన తీర్పునిచ్చారు. జడ్జి దివాకర్ గతంలో బరేలీలో పనిచేస్తున్న సమయంలోనూ 13 మందికి మరణశిక్ష విధించిన చరిత్ర ఉంది. దీంతో ఆయన ఇప్పటివరకు తన పదవీ కాలంలో మొత్తం 35 మందికి మరణశిక్ష విధించినట్లయింది.2022లో వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో వీడియోగ్రాఫిక్ సర్వేకు ఆదేశాలు జారీ చేసి జడ్జి రవికుమార్ దివాకర్ దేశవ్యాప్త గుర్తింపు పొందారు. అయితే, సెషన్స్ కోర్టు విధించిన మరణశిక్షలు అమలు కావాలంటే నిబంధనల ప్రకారం హైకోర్టు వాటిని ధ్రువీకరించాల్సి ఉంటుంది. అలాగే, ఈ తీర్పులను సవాలు చేస్తూ నిందితులకు సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునే చట్టపరమైన అవకాశం కూడా ఉంటుంది.

# 148 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి

**మొదటిపేజీ తరువాయి -** ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. సభలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... డీఎస్సీ నిర్వహణ, విద్యావ్యవస్థలో చేపట్టిన సంస్కరణలపై కీలక వివరాలు వెల్లడించారు. డీఎస్సీ పరీక్ష ప్రక్రియను ప్రభుత్వం ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహించిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఏకంగా 148 రోజుల్లోనే నియామక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని సభకు తెలియజేశారు. రాబోయే రోజుల్లో కూడా ప్రతి ఏటా క్రమం తప్పకుండా డీఎస్సీ నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని లోకేశ్ వివరించారు. ఉపాధ్యాయుల నియామకాలు, బదిలీలను అత్యంత పారదర్శకంగా తెలిపారు. ఉపాధ్యాయులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించేందుకు సింగపూర్, ఫిన్‌లాండ్ వంటి దేశాలకు పంపిస్తుంటే, గత వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద నిలబెట్టి కించపరిచిందని ఎద్దేవా చేశారు. ప్రజా ప్రభుత్వంలో వ్యవస్థను ప్రశ్నించే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉందన్నారు.డీఎస్సీ నియామక ప్రక్రియపై న్యాయస్థానాల్లో 336 కేసులు దాఖలైన విషయాన్ని మంత్రి గుర్తుచేస్తూ, కోర్టు ఆదేశాలకు అనుగుణంగా దేశ చరిత్రలోనే తొలిసారిగా డీఎస్సీలో వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లను పక్కాగా అమలు చేశామని వెల్లడించారు. ఇక ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ కి సంబంధించి 3.68 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, అందులో 1.87 లక్షల మంది ఉత్తీర్ణత సాధించారనే గణాంకాలను అసెంబ్లీ వేదికగా లోకేశ్ సమర్పించారు.

ప్రజా మంటలు

మంగళవారం 18-08-2026

# నాణ్యత లేని డబల్ రోడ్డు పనులతో 300 కోట్ల నష్టం

**బుగ్గారంకు మరో 200 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయండి**

**ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా అనుమతి పత్రాలు జారీ చేయాలి**

**పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి**

**మండల సమైక్య, వి.ఓ., అంగన్ వాడి భవనాలకు భూమి కేటాయించండి**

**డబల్ రోడ్డు బాధితులకు నష్ట పరిహారం ఇప్పించండి**

**బుగ్గారం ప్రజావాణిలో చుక్క గంగారెడ్డి విజ్ఞాపనలు**




**బుగ్గారం, ప్రజా మంటలు, ఆగస్ట్ 17:** జగిత్యాల జిల్లా బుగ్గారంలో నిర్మించిన డబల్ రోడ్డు పనులు నాణ్యత లేవని, నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని, వాటితో ప్రజల కు రూ.300 కోట్ల నష్టం జరిగిందని తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి ఆరోపించారు. బుగ్గారం గ్రామానికి మరో రెండు వందల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి లబ్ధిదారులను ఆదుకోవాలని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి సోమవారం జరిగిన బుగ్గారం మండల ప్రజావాణిలో నోడల్ అధికారి అయిన ఎంపిడివో యం. సుమంత్ కు విజ్ఞప్తి చేశారు.ఇందిరమ్మ ఇండ్లకు ఎలాంటి ఫీజులు ( రుసుములు) తీసుకోకుండా ఉచితంగా గృహ నిర్మాణ అనుమతి పత్రాలు జారీ చేయాలని ఆయన కోరారు. పెండింగ్ లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల బకాయిలు వెంటనే ప్రభుత్వం ద్వారా చెల్లించి లబ్ధిదారులను అప్పుల బారి నుండి కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.బుగ్గారం మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ రోడ్డు, ఇరువైపుల డ్రైనేజీ నిర్మాణాలు నాణ్యతా లోపం, నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని ఆయన ఆరోపిస్తూ మండల ప్రజా వాణిలో పిర్యాదు చేశారు. కాంట్రాక్టర్లు చేసిన తప్పుడు పనుల కారణంగా రోడ్డు ఎత్తు లేచి ఇండ్లు, ఖాళీగా ఉన్న ఇండ్ల స్థలాలు అన్నీ లోతట్టు ప్రాంతాలకు గురయ్యాయని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా, నాణ్యతా లోపంతో కాంట్రాక్టర్లు చేసిన తప్పుడు పనుల వలన, గ్రామస్తులు పిర్యాదులు చేసినా అధికారులు నిర్లక్ష్యం చేయడం వలన బుగ్గారం గ్రామ ప్రజలకు రూ.300 కోట్ల నష్టం జరిగిందని చుక్క గంగారెడ్డి ఆరోపించారు. కాంట్రాక్టర్లపై, అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని నష్టపోయిన ఇండ్లకు, ఇండ్ల స్థలాల వారికి తగు నష్ట పరిహారం చెల్లించాలని చుక్క గంగారెడ్డి కోరారు. బుగ్గారంలోని పడమటి వాడ అంగన్ వాడి భవనం, పడమటివాడ మహిళా వివో భవనం కొరకు, మండల మహిళా సమైఖ్య భవనం కొరకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని ఆయన కోరారు. బుగ్గారం శివారులోని సర్వే నంబర్ 729, 730 లలో గల 2-22 ఎకరాల ప్రభుత్వ భూమిని వెంటనే వెలికి తీసి ఈ భవనాలకు కేటాయించాలని ప్రజావాణిలో అధికారులను చుక్క గంగారెడ్డి కోరారు.కాగా... బుగ్గారం తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపివో బింగి సురేష్ లు ఈ విజ్ఞాపనలను పరిశీలించారు. ఆయా శాఖలకు బదిలీ చేసి నెల రోజులలోపు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# టీఎన్జీవోల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై విస్తృత చర్చ



**హైదరాబాద్ ఆగస్టు 16 (ప్రజా మంటలు):** తెలంగాణ నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్జీవోలు) కేంద్ర సంఘ కార్యాలయం, నాంపల్లిలో టీఎన్జీవోల రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ అధ్యక్షతన, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. ముజీబ్ హుస్సేన్ కార్యనిర్వహణలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో పాటు 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా పీఆర్సీ, డీఏలు, పెండింగ్ బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎంప్లాయి హెల్త్ స్కీమ్ తదితర అంశాలను నాయకులు రాష్ట్ర కార్యవర్గం దృష్టికి తీసుకువచ్చారు.

**ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి**

కరీంనగర్ జిల్లా టీఎన్జీవోల అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను రాష్ట్ర కార్యవర్గం దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులు, ఆర్థిక కష్టాలను వివరించిన ఆయన, ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, పెండింగ్ డీఏలను త్వరితగతిన విడుదల చేయాలని కోరారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం కృషి చేయాలని ఆయన కోరారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**ఉద్యోగుల ఐక్యతకు ప్రతీకగా జెండా, కండువా**

తెలంగాణ ఎన్జీవో కేంద్ర సంఘం ఆధ్వర్యంలో టీఎన్జీవోల జెండా, కండువాను ఆవిష్కరించడం శుభసూచకమని దారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇవి ఉద్యోగుల ఐక్యతకు ప్రతిబింబంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కేంద్ర సంఘ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**'ఉద్యోగుల గొంతుక'కు రూ.2.82 లక్షల చందా**

ఉద్యోగుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లే 'ఉద్యోగుల గొంతుక' పత్రిక జీవితకాల చందాల సేకరణ కార్యక్రమంలో భాగంగా, కరీంనగర్ జిల్లా సభ్యుల నుంచి సేకరించిన రూ. 2,82,000 విలువైన చెక్కును కేంద్ర సంఘ నాయకులకు అందజేశారు.ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా సంఘం చేసిన కృషిని కేంద్ర సంఘ నాయకులు అభినందించారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, సర్దార్ హర్మిందర్ సింగ్, రాగి శ్రీనివాస్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొంకూరు శంకర్, సందీప్ రెడ్డి, మిర్యాల నాగేందర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, ప్రవీణ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగిపోనున్న పార్థివ వాహన సేవలు

**-- రెండేళ్లుగా బకాయిలు చెల్లించని ప్రభుత్వం!**




**సికింద్రాబాద్, ఆగస్ట్ 17 ( ప్రజామంటలు):** తెలంగాణలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందినవారు మరణిస్తే వారి మృతదేహాలను స్వగ్రామాలకు తరలించడం ఎంతో ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారింది. ఇదే అవకాశంగా భావించి ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులు దోపిడీకి పాల్పడుతుండటంతో, నాటి ప్రభుత్వం 2016 నవంబర్‌లో ఉచిత పార్థివ వాహన సేవలను అందుబాటులోకి తెచ్చింది. వీటి నిర్వహణ బాధ్యతలను జీవీకే-ఈఎంఆర్ఐ సంస్థకు అప్పగించింది. నిరుపేద కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తున్న ఈ సేవలు ఇప్పుడు బంద్ అయ్యే ప్రమాదంలో పడ్డాయి.గత రెండేళ్లుగా నిర్వహణ సంస్థకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. నిధుల కొరత వల్ల వాహనాల నిర్వహణ ఖర్చులు, డీజిల్ ఛార్జీలతో పాటు పనిచేసే సిబ్బందికి జీతాలు చెల్లించడం తీవ్ర భారంగా మారింది. ఈ వాహనాల్లో పనిచేసే ఉద్యోగులు సైతం పేద కుటుంబాలకు చెందినవారే కాగా, వారి జీతాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిధుల విడుదలపై నిర్వాహకులు పలుమార్లు విన్నవించినా సర్కారు స్పందించకపోవడంతో సేవలు నిలిచిపోయే స్థాయికి చేరుకున్నాయి.పార్థివ వాహనాలే కాకుండా 108, 102 అత్యవసర సేవల నిర్వహణకు కూడా బకాయిలు విడుదల కాకపోవడంతో భవిష్యత్తులో ఈ సేవలు కూడా ఆగిపోయే ముప్పు ఉందని అధికారులు, ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులను విడుదల చేయాలని, పేదలకు ఎంతో అవసరమైన ఈ ఉచిత సేవలు ఆటంకం లేకుండా కొనసాగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# పద్మారావునగర్ శ్రావణ బోనాల శోభ



**సికింద్రాబాద్,ఆగస్టు 17 ( ప్రజా మంటలు):** పద్మారావు నగర్ వెంకటాపురం కాలనీ వాకర్ టౌన్‌లోని ప్రసిద్ధ నల్ల పోచమ్మ ఆలయం ఆదివారం భక్తిపారవశ్యంతో మురిసిపోయింది. శ్రావణమాసం పురస్కరించుకుని కాలనీవాసులు బోనాల వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన మహిళలు పట్టువస్త్రాలు ధరించి, మంగళవాయిద్యాల నడుమ సంప్రదాయబద్ధంగా బోనాలను నెత్తిన ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఆలయ నిర్వాహకులు, హైకోర్టు సీనియర్ న్యాయవాదులు రామారావు ఇమ్మానేని, వాసు దేవరాజులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ,అన్న ప్రసాదాలను అందజేశారు. కాలనీ ప్రజలందరి కలయికతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం సంతరించుకుంది.

# బుగ్గరాం ఎం ఈ ఓ గా బాధ్యతలు స్వీకరించిన మోహన్ రెడ్డి



**వెల్గటూర్ ఆగష్టు 17 ( ప్రజా మంటలు )** బుగ్గారం: బుగ్గారం మండల విద్యాధికారిగా అన్నాడి మోహన్ రెడ్డి సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ మండల విద్యాధికారిగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు అనారోగ్య కారణాల రీత్యా బాధ్యతల నుండి తప్పుకున్నారు. దీనితో బుగ్గారం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గా విధులు నిర్వహిస్తున్న మోహన్ రెడ్డి మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో విద్యా రంగంలో బుగ్గారం మండలాన్ని అగ్రగామిగా నిలపడానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రధానోపాధ్యాయులు ఆయనకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, శ్రీలత ఉపాధ్యాయ సంఘాల నాయకులు విజయ్ కుమార్, సతీష్ రావు, కొమరయ్య, రాజేష్, అశోక్, ప్రకాష్, ఎం ఆర్ సి సిబ్బంది పురుషోత్తం, రాజేష్, హరిత, సమత ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఆశా వర్కర్‌గా జంపాల రాదిక కు అవార్డు



**ఎల్కతుర్తి ఆగస్టు 17 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని పిఎచ్ సీ సెంటర్‌లో ఆశా వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న జంపాల రాదికకు ఉత్తమ ఆశా వర్కర్‌గా అవార్డు లభించడం అభినందనీయమని ఎల్కతుర్తి మండల, ఆశా వర్కర్లు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న రాష్ట్ర మంత్రులు. జిల్లా కలెక్టర్ చౌహాన్ బాజ్‌పేయి ఇంచార్జీ కలెక్టర్ రవి గార్ల చేతుల మీదుగా జంపాల రాధికకు ఉత్తమ ఆశా వర్కర్ అవార్డును అందుకున్నారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ఆమె చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డు అందించడం పట్ల ఎల్కతుర్తి మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. జంపాల రాధికకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా మరింత సేవాభావంతో పనిచేసి మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఎల్కతుర్తి మండలంలోని ఇతర ఆశా వర్కర్ల సేవలను కూడా ప్రభుత్వం గుర్తించి, వారికి ఉత్తమ ఆశా వర్కర్ అవార్డులు లభించేలా ప్రోత్సహించాలని కోరారు.

# బురదమయమైన ఎల్కతుర్తి-దామెర రహదారి ఎప్పుడు బాగుపడుతుంది

**ప్రభుత్వం, ఎమ్మెల్యే స్పందించాలి -- బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్**





**ఎల్కతుర్తి ఆగస్టు 17 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి నుంచి సిద్దిపేట హైవేకు కూతవేటు దూరంలో ఉన్న చింతలపల్లి - దామెర - సోమదేవరపల్లి - ధర్మసాగర్ రహదారి పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఎల్కతుర్తి సర్కిల్ వద్ద గత నాలుగు నెలలుగా రోడ్డు బురదమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడం దురదృష్టకరం.వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ఒకవైపు హైవే నిర్మాణ పనుల్లో తీసిన నాలా, మరోవైపు సరిగా లేని రహదారి కారణంగా వాహనదారులు, పాదచారులు ఈ బురద నీటిలో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అత్యవసర పనుల కోసం వెళ్లే ప్రజలు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఎల్కతుర్తి అభివృద్ధి అంటే కేవలం శంకుస్థాపనలు చేసి వెళ్లిపోవడమేనాకనీసం ప్రజలు నిత్యం ఉపయోగించే రహదారికి మరమ్మతులు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందా హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే గారు ఇప్పటికైనా స్పందించి ఎల్కతుర్తి--దామెర రహదారిని వెంటనే మరమ్మతులు చేయించి ప్రజలను ఇబ్బందుల నుంచి బయటపడేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది.ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఎల్కతుర్తి--దామెర రహదారిలోని గుంతల్లో బురదలో నాట్లు వేసి వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ---"ప్రజలు నాలుగు నెలలుగా రోడ్డు కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షం వస్తే ఈ రోడ్డులో వాహనాలు వెళ్లాలన్నా, ప్రజలు నడుచుకుంటూ వెళ్లాలన్నా నరకయాతనగా మారుతోంది. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా శంకుస్థాపనలు, కార్యక్రమాలతో కాలం వెళ్లదీయడం కాదు. వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. లేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ప్రజా ఉద్యమం చేపడతాం." అని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో మండల ప్రభారీ లక్కిరెడ్డి తిరుమల గారు పాల్గొని ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండించారు."ఈ బురద నీటిలో ప్రజల ప్రయాణం ఇంకెన్నాళ్లు ,,"ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి డిమాండ్ చేశారు.ది

# కొండగట్టు వద్ద రోడ్డు ప్రమాదం

**20 మందికి తీవ్ర గాయాలు**








**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు ) ఆగస్ట్ 17:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ - ఆర్టీసీ బస్సు ఢీ కొనగా 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని తగు చర్యలు చేపట్టారు.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

**- మల్యాలలో సీసీ కెమెరాలు ప్రారంభం**

**-జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**





**గొల్లపల్లి, ఆగస్టు 17 (ప్రజా మంటలు):** నేరాల నియంత్రణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మల్యాల గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన 48 నూతన సీసీ కెమెరాలను సోమవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి గ్రామం, పట్టణం సీసీ కెమెరాలతో నిఘాలో ఉంటే పోలీసింగ్ మరింత సమర్థవంతంగా మారుతుందని తెలిపారు. దొంగతనాలు, గొడవలు, రోడ్డు ప్రమాదాలు తదితర ఘటనల్లో నిందితులను త్వరగా గుర్తించేందుకు కెమెరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు.ఇటీవల మల్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనం కేసులో సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. జగిత్యాల, మెట్‌పల్లి, ధర్మపురి, కోరుట్లతో పాటు మల్యాలలో కూడా పెద్దఎత్తున కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఇళ్లతో పాటు వ్యాపార సంస్థలు, అపార్ట్‌మెంట్లలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రధాన రహదారులు, క్రాస్‌రోడ్లు, మార్కెట్లు, రద్దీ ప్రాంతాల్లో కెమెరాల ఏర్పాటు అవసరమన్నారు.మల్యాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన సర్పంచ్ జయ, ప్రసాద్, పంచాయతీ పాలకవర్గం, సీఐ రాజుకుమార్, ఎస్ఐ సందీప్, ప్రజాప్రతినిధులను ఎస్పీ అభినందించారు. ఇదే స్ఫూర్తితో పరిసర ప్రాంతాల ప్రజలు కూడా ముందుకు రావాలని కోరారు.

## గాంధీ కాలేజీలో విద్యా ప్రమాణాల మరింత పెంపుకు కృషి చేయాలి

**--ఘనంగా వైస్ ప్రిన్సిపల్ డా. బి.వి.నాగ మోహన్ జన్మదిన వేడుకలు**



**సికింద్రాబాద్, ఆగస్టు 17 ( ప్రజామంటలు):** గాంధీ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ (అకడమిక్), ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ బి.వి. నాగ మోహన్ జన్మదిన వేడుకలను సోమవారం కాలేజీ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె. ఇందిర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపల్ (అడ్మినిస్ట్రేషన్) డాక్టర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుబ్బారావు, ఆఫీస్ సూపరింటెండెంట్లు సురేష్ కుమార్, శివప్రసాద్, వేణుగోపాల్‌తో పాటు పలువురు అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకల్లో భాగంగా డాక్టర్ నాగ మోహన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, అందరి సమక్షంలో కేక్ కట్ చేయించారు. ఆయనకు ఆయురారోగ్యాలు, నిండైన సంతోషం లభించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన వృత్తిపరమైన విజయాలు సాధించాలని సహోద్యోగులు ఆకాంక్షించారు.తనపై చూపిన ప్రేమాభిమానాలకు డాక్టర్ నాగ మోహన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గాంధీ మెడికల్ కాలేజీలో విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## గొల్లపల్లి మండల కేంద్రంలో తొలి 'ప్రజావాణి' కార్యక్రమం

**ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు.**





**గొల్లపల్లి అగస్ట్ 17 ప్రజా మంటలు :** తెలంగాణ ప్రభుత్వం ప్రజల సమస్యలను స్థానిక స్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో ప్రారంభించిన మండల స్థాయి 'ప్రజావాణి' కార్యక్రమం గొల్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నాడు ప్రారంభమైంది. ఈ తొలి ప్రజావాణి కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలపై అధికారులకు వినతి పత్రాలను సమర్పించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 4 వినతి పత్రాలు నమోదు కాగా(1) ఇందిరమ్మ ఇళ్ల మంజూరు (2) రెవెన్యూ సమస్యల పై(1) భూభారతి (రెవెన్యూ) సమస్యలకు సంబంధించిన వినతి పత్రం ఈ సందర్భంగా ఎంపీడీఓ రవీందర్ రావు మాట్లాడుతూ, మండల స్థాయిలోనే ప్రజా సమస్యలకు పరిష్కారం చూపడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అర్జీదారులు సమర్పించిన ప్రతి వినతిపత్రాన్ని సేకరించి, సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా, సంబంధిత శాఖల అధికారులు తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మహ్మద్ అబ్దుల్ మజీద్ , మండల పరిషత్ అధికారులు, రెవెన్యూ శాఖ, వైద్య, విద్య,పోలీస్, వ్యవసాయ, ఐసిడిఎస్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, విద్యుత్ మరియు ఇతర వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంఈఓ గా బాధ్యతలు స్వీకరించిన మోహన్ రెడ్డి





**బుగ్గారం, ( ప్రజా మంటలు) ఆగస్ట్ 17:** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల విద్యాధికారిగా అన్నాడి మోహన్ రెడ్డి సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు మండల విద్యాధికారిగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు అనారోగ్య కారణాల రీత్యా బాధ్యతల నుండి తప్పుకున్నారు. దీనితో బుగ్గారం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గా విధులు నిర్వహిస్తున్న మోహన్ రెడ్డి మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో విద్యా రంగంలో బుగ్గారం మండలాన్ని అగ్రగామిగా నిలపడానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రధానోపాధ్యాయులు ఆయనకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, శ్రీలత ఉపాధ్యాయ సంఘాల నాయకులు విజయ్ కుమార్, సతీష్ రావు, కొమరయ్య, రాజేష్, అశోక్, ప్రకాష్, ఎం ఆర్ సి సిబ్బంది పురుషోత్తం, రాజేష్, హరిత, సమత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వానికి భారమైందా...

**కల్యాణ లక్ష్మి రద్దుకు రేవంత్ రెడ్డి కుట్ర**

**- దావ వసంత సురేష్**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) ఆగస్ట్ 17:** జగిత్యాల జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు జిల్లా తొలి జడ్పీ మాజీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ఆధ్వర్యంలో బీడీ కార్మికుల కు, వృద్ధుల కు కొత్త పెన్షన్లు అందించడంతో పాటు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగించాలని సోమవారం జగిత్యాల ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బి.ఆర్.ఎస్. నాయకులు, వృద్ధులు, బీడీ కార్మికులు, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులతో కలిసి నిరసనగా నల్ల రిబ్బన్ ధరించి బీడీలు చుడుతూ నిరసన తెలియజేసారు. అనంతరం ఆర్డిఓ కు వినతిపత్రం అందజేసారు.ఈ సందర్భంగా దావ వసంత సురేష్ గారు మాట్లాడుతూ...రేవంత్ రెడ్డి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకానికి ఎగనామం పెట్టే ఎగవేతల రేవంత్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. కల్యాణ లక్ష్మి పథకానికి కోర్టు స్టే ఇస్తే దానికి ప్రభుత్వం తరపున కౌంటర్ దాఖలు చేయకుండా జాప్యం చేయడానికి మర్మం ఏమిటని ఆమె ప్రశ్నించారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఆడబిడ్డలంటే రేవంత్ రెడ్డికి ఎందుకింత అక్కసు అని అన్నారు.కెసిఆర్ మేనమామ లాగా ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి పథకం కింద 75 వేల నుండి మొదలుకొని లక్ష 116 ఇచ్చారని అన్నారు. కెసిఆర్ గారి మీద కక్ష తో ఎలాగైనా అధికారంలోకి రావాలని కళ్యాణ లక్ష్మి కింద లక్ష రూపాయల చెక్కుతో పాటు తులం బంగారం ఇస్తా అని ఆశ చెప్పి తులం బంగారం సంగతి పక్కన పెట్టి కనీసం లక్ష రూపాయలు ఇచ్చే పరిస్థితిలో లేరు అని అన్నారు. కెసిఆర్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో నీరు గర్చే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు కార్యకర్తలు, కౌన్సిలర్లు తాజా మాజీ ప్రతినిధులు, పెన్షన్ రాని బీడీ మహిళా తల్లులు, కళ్యాణ లక్ష్మి బాధితులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా మంటలు



# భాగ్యనగరంలో పెరుగుతున్న దోమల బెడద

**సమన్వయంతో పనిచేస్తేనే సమస్యకు పరిష్కారం!**

**జీహెచ్ఎంసీ, ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం జనవరి నుంచి ఇప్పటివరకు 270 కేసులు**

**సమన్వయంగా పనిచేయాల్సిన శాఖలు సమావేశాలకే పరిమితం**

**యాంటీ లార్వా ఆపరేషన్లు, నివాస ప్రాంతాల్లో ఫాగింగ్ ఏర్పాటు**



వర్షాకాలంలో తేమ ఎక్కువగా ఉండటంతో దోమలు వృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుంది. అలా మహానగరం అంతటా దోమలు ప్రస్తుతం స్వైరవిహారం చేస్తున్నాయి. ఇక మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న వారి పరిస్థితి దారుణంగా ఉంది. అక్కడ దోమల బెడద ఎక్కువగా ఉండటంతో సమస్య తీవ్రంగా మారింది. ప్రధానంగా డెంగీ కేసులు పెరుగుతున్నాయి. గాంధీ ఉస్మానియా, ఫీవర్ ఆసుపత్రులతో పాటు బస్తీ దవాఖానాలకు డెంగీ బాధితుల సంఖ్య ఎక్కువ అవుతోంది.జీహెచ్ఎంసీ, ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 270 వరకు డెంగీ కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు మున్సిపల్ శాఖలోని ఎంటమాలజీ విభాగం దోమల నివారణకు సమన్వయంతో పనిచేయాలి. కానీ కొందరు అధికారులు మాత్రం సమావేశాలకే పరిమితం అవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఎక్కువగా ఫిర్యాదులు వచ్చే ప్రాంతాల్లోనే అడపాదడపా ఫాగింగ్ చేసి వదిలేస్తున్నారు. కానీ జీహెచ్ఎంసీ, ఆరోగ్యశాఖ సంయుక్తంగా యాంటీ లార్వా ఆపరేషన్లు, నివాస ప్రాంతాల్లో ఫాగింగ్, ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాల్సి ఉంటుంది. అవి చేయకపోవటంతో నగరంలో చాలా ప్రాంతాలు లార్వా వృద్ధికి కేంద్రాలుగా మారుతున్నాయి.ఈ విధంగా దోమల నివారణ :వానాకాలంలో జీహెచ్ఎంసీ, వైద్య ఆరోగ్యశాఖ కలిసి సమన్వయంతో పనిచేయాలి.డెంగీ, చికున్‌గన్యా, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధుల కేసులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి.అధిక ప్రభావం ఉన్న ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది యాంటీ లార్వా ఆపరేషన్లు, రసాయనాలు స్ప్రేయింగ్‌తో పాటు ఫాగింగ్ చర్యలను తక్షణమే చేపట్టాలి.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు, మందుల కిట్లు అందుబాటులో ఉంచుకోవాలి.అధికంగా నీరు నిలిచే నివాస ప్రాంతాలను గుర్తించి తనిఖీలు చేయాలి. అక్కడ దోమల లార్వాపై డ్రోన్ల సాయంతో మందులను పిచికారీ చేయాలి.ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఇతర వైద్య సిబ్బంది కలిసి ప్రతి ఇంటికి వెళ్లి పరిశుభ్రత గురించి ప్రజలను చైతన్యవంతం చెయ్యాలి.వారంలో ఒక రోజు శుక్ర లేదా ఆదివారం డ్రై డే పాటించాలి. ఇళ్లల్లో నీటి తొట్లు, కూలర్లు, టైర్లల్లో నీరు నిల్వ లేకుండా ఖాళీ చేసి ఎండబెట్టే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలి.

# నాన్‌వెజ్ ప్రియులకు ‘గుడ్డు’ న్యూస్

**ఎగ్, చికెన్ ధరలు తగ్గుతున్నాయ్**

**రాష్ట్రంలో చికెన్, గుడ్ల రేట్లకు శ్రావణ మాసం ఎఫెక్ట్**

**తగ్గిన వినియోగంతో దిగొస్తున్న ధరలు**

**ప్రస్తుతం కేజీ చికెన్ రూ.260 -270కే**

**ఒక్కో గుడ్డు రూ.6 నుంచి రూ.6.50కు విక్రయం**

**శ్రావణమాసం ప్రభావంతో తగ్గిన చికెన్ గుడ్ల ధరలు**



సాధారణంగా మార్కెట్‌లో స్థిరంగా ఉండే చికెన్, గుడ్ల ధరలు శ్రావణ మాసం కారణంగా స్వల్పంగా దిగొచ్చాయి. రాబోయే వారంలో వీటి రేట్లు మరింత తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. పది రోజుల కిందటి వరకు చికెన్ ధరలకు రెక్కలొచ్చినట్లు ఉండేవి. ఈ మాసంలో చాలా మంది ఉపవాసాలు పాటిస్తుండటంతో బిర్యానీ, చికెన్‌తో పాటు గుడ్ల వినియోగం తగ్గుముఖం పడుతోంది. మార్కెట్‌లో ఉత్పత్తికి తగిన డిమాండ్ లేకపోవడంతో ధరలు కొంత తగ్గుముఖం పట్టాయి.గత కొన్ని నెలలుగా ఎగబాకుతున్న చికెన్, గుడ్ల ధరలు ప్రస్తుతం నెమ్మదిస్తుండటం వినియోగదారులకు కాస్త ఉపశమనం కలిగిస్తోంది. ఈ నెలలో వివాహాలు చాలానే జరుగుతున్నప్పటికీ చికెన్, గుడ్ల వినియోగం మాత్రం అంతంత మాత్రంగానే ఉంటుంది. నెల రోజుల కిందటి వరకు కిలో చికెన్‌కు రూ.320 నుంచి రూ.340 వరకు విక్రయించిన చిల్లర వ్యాపారులు, ఇప్పుడు కిలోకు రూ.260 నుంచి రూ.270 వరకే అమ్ముతున్నారు. చికెన్ ధరలు క్రమంగా మరింత తగ్గొచ్చని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ (ఎన్ఈసీసీ) ప్రకారం హైదరాబాద్‌లో ప్రస్తుతం చిల్లర వ్యాపారులు ప్రస్తుతం టోకు వర్తకుల నుంచి ఒక్కో గుడ్డును రూ.5.45 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ప్రాంతాన్ని బట్టి వినియోగదారులకు రూ.6 నుంచి రూ.6.50 ధరల మధ్య విక్రయిస్తున్నారు. నెల రోజుల కిందట రిటైల్ గుడ్డు ధర రూ.8 నుంచి రూ.9 వరకు ఉండేవి. గుడ్లు పగలడం లేదా పాడైపోవడం, బల్క్‌గా నిల్వ ఉంచడంతో నష్టపోయే ప్రమాదం ఉంటుంది. సరఫరా, అమ్మకాల మధ్య ఉన్న స్వల్ప వ్యత్యాసం కారణంగా ధరలు తగ్గాయని మార్కెట్ వర్గాలు సూచిస్తున్నాయి.పోషకాహారంలో గుడ్లు కీలక పాత్ర పోషిస్తాయి. అనేక రకాల వంటకాల తయారీలో వీటిని ఎక్కువగా ఉపయోగిస్తారు. పాఠశాలలు, కళాశాల హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు, విందు ఏర్పాట్లు, హోటళ్లలో వీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఎక్కువ డిమాండ్ ఉండటంతో గత కొన్ని నెలలుగా అమాంతం ధరలు ఎగబాకుతూ వచ్చాయి. నిత్యం వీటిని వినియోగించే వారికి ఇటీవలి ధరల తగ్గుదల ప్రయోజనకరంగా మారనున్నాయి.ప్రాథమిక గణాంకాల నివేదిక-2025 ప్రకారం దేశవ్యాప్తంగా గుడ్ల ఉత్పత్తిలో రెండు తెలుగు రాష్ట్రాలు టాప్ త్రీలో ఉన్నాయి. తొలి స్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలవగా తెలంగాణ మూడో స్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా మొత్తం గుడ్ల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ 18.37 శాతం, తర్వాత తమిళనాడు15.63 శాతం ఉండగా తెలంగాణ 12.98 శాతంగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది. అలాగే 2018-19 నుంచి 2024-25 (6 సంవత్సరాలు) వరకు దేశ తలసరి గుడ్ల వినియోగంలోనూ వరుసగా ఆంధ్రప్రదేశ్ (516), తెలంగాణ (510) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతుండటం విశేషం.ఈ ఏడాది వేసవి కాలం మొదలుకొని మొన్నటి వరకు చికెన్ ధరలు భగ్గుమన్నాయి. వాటితో పాటు గుడ్ల రేట్లూ ఎగబాకాయి. పశ్చిమాసియా యుద్ధం, దాణా ధరల పెరుగుదల కారణమయ్యాయి. అయితే ఈ వేసవిలో ఒక్కో కోడి పిల్ల ధర రూ.50 నుంచి రూ.60 వరకు ఉంటాయని రైతులు చెబుతున్నారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా తరచుగా పిల్లలు చనిపోతుంటాయి. అందుకే ఈ సమయంలో పౌల్ట్రీ ఫారమ్‌లు కోళ్ల పెంపక సామర్థ్యాన్ని సుమారు 20 వేలకే పరిమితం చేస్తాయి. దీనివల్ల సహజంగానే బ్రాయిలర్ కోళ్ల ఉత్పత్తి తగ్గి కొరత ఏర్పడుతుంది. ఫలితంగా ధరలూ పెరుగుతాయి.


# రాష్ట్రంలో జాతీయ సగటును మించిన క్యాన్సర్ కేసులు

**కట్టడికి ‘బయోఫౌండ్రీ టాస్క్‌ఫోర్స్’**

**రాష్ట్రంలో ఆందోళన రేపుతున్న క్యాన్సర్ కేసుల పెరుగుదల**

**జాతీయ సగటు 12.8 శాతం కాగా, రాష్ట్రంలో 39.5 శాతం వృద్ధి**

**బాధితుల్లో 70 శాతం మంది 40-69 ఏళ్ల వయసు వారే**



రాష్ట్రంలో క్యాన్సర్ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. జాతీయ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో క్యాన్సర్ వృద్ధి రేటు మూడింతలు ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఒకపక్క రోగుల సంఖ్య పెరుగుతుంటే, మరోపక్క ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య కూడా భయపెడుతోంది. ఈ క్రమంలో ప్రాణాంతక క్యాన్సర్‌ను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. సరికొత్త వైద్య విధానాలను వేగంగా అందుబాటులోకి తెస్తోంది.2020-2025 మధ్య దేశవ్యాప్తంగా క్యాన్సర్ కొత్త కేసుల్లో జాతీయ సగటు పెరుగుదల 12.8 శాతంగా ఉంది. కానీ మన రాష్ట్రంలో ఇది ఏకంగా 39.5 శాతంగా నమోదు కావడం గమనార్హం. ప్రస్తుతం రాష్ట్రంలో 4.73 లక్షల మంది క్యాన్సర్ బారిన పడి చికిత్స పొందుతున్నారు. ప్రతి ఏడాదీ 76 వేలకు పైగా కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. ఈ మహమ్మారి కాటుకు ఏటా 40 వేల మందికి పైగా బలవుతున్నారని ప్రభుత్వం గుర్తించింది. ముఖ్యంగా క్యాన్సర్ బాధితుల్లో 70 శాతం మంది 40 నుంచి 69 ఏళ్ల మధ్య వయసున్న వారే కావడం ఆందోళనకరం.రాష్ట్రంలో గుర్తించిన మొత్తం క్యాన్సర్ కేసుల్లో 59 నుంచి 61 శాతం వరకు మహిళలే ఉన్నారు. వీరు ప్రధానంగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్లతో బాధపడుతున్నారు. ఇక పురుషుల విషయానికి వస్తే వారు ఎక్కువగా నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ల బారిన పడుతున్నారు. పురుషుల్లో ఈ రకమైన క్యాన్సర్ల పెరుగుదల 1.7 రెట్లుగా ఉన్నట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి.క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే సులభంగా నయం చేయవచ్చు. కానీ ప్రజల్లో ఉన్న నిర్లక్ష్యం వారి ప్రాణాల మీదకు తెస్తోంది. వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించిన స్క్రీనింగ్‌లో పలువురికి క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అయితే ఇలా గుర్తించిన అనుమానితుల్లో 88.2 శాతం మంది తదుపరి నిర్ధారణ పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు రావడం లేదు. ఆసుపత్రులకు వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నారు. దీంతో వ్యాధి పూర్తిగా ముదిరిపోతోంది. ప్రాణాపాయ స్థితికి చేరుకున్న తర్వాతే ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ఫలితంగా చికిత్స ఫలించక ప్రాణాలు కోల్పోతున్నారు.ప్రమాదకరంగా మారుతున్న క్యాన్సర్‌ను కట్టడి చేయడానికి ప్రభుత్వం కచ్చితమైన వైద్య విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. వ్యాధి సోకిన తర్వాత నయం చేయడం కంటే ముందే దాన్ని అంచనా వేయడంపై దృష్టి పెట్టింది. రోగులకు కచ్చితమైన వైద్యం అందించేలా ఇటీవల ‘బయోఫౌండ్రీ టాస్క్‌ఫోర్స్’ను ఏర్పాటు చేసింది. ఈ టాస్క్‌ఫోర్స్ ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి క్యాన్సర్‌ను కట్టడి చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. డిజిటల్ హిస్టో పాథాలజీ, ఎలక్ట్రానిక్ రికార్డులను అనుసంధానం చేయనుంది. బయాప్సీ నమూనాలను దీర్ఘకాలం పాటు సురక్షితంగా భద్రపరిచేందుకు రాష్ట్ర స్థాయిలో ఒక బయోబ్యాంక్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. పరిశోధనల కోసం సీఎస్ఐఆర్- ఐజీఐబీ, సీసీఎంబీ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల నైపుణ్యాన్ని వినియోగించుకోనుంది.క్యాన్సర్ చికిత్స కోసం రోగులు ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా ప్రభుత్వం ఇక్కడే సకల వసతులు కల్పిస్తోంది. వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఒక ప్రత్యేక రోడ్ మ్యాప్‌ను రూపొందించింది. తొలి దశలో భాగంగా నాలుగు నగరాల్లో సమగ్ర క్యాన్సర్ కేంద్రాలను (సీసీసీ) నెలకొల్పింది. గుంటూరు, విశాఖపట్నం, కర్నూలు, కడప జిల్లాల్లో ఇవి అందుబాటులోకి వచ్చాయి. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 17 ఆంకాలజీ యూనిట్లను ప్రారంభించింది. 23 జిల్లాల్లో డిస్ట్రిక్ట్ డేకేర్ కీమోథెరపీ కేంద్రాలను (డీసీసీసీ) ఏర్పాటు చేసి రోగులకు భరోసా కల్పిస్తోంది.క్యాన్సర్ వైద్యం అత్యంత ఖరీదైనది. సామాన్యులపై ఈ ఆర్థిక భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటోంది. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా ఆంకాలజీ విభాగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోంది. ఏటా రూ.746 కోట్లను క్యాన్సర్ చికిత్సల కోసమే వెచ్చిస్తోంది. మరోవైపు నివారణ చర్యల్లో భాగంగా బాలికలకు ప్రాధాన్యం ఇస్తోంది. భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ రాకుండా ఉండేందుకు రాష్ట్రవ్యాప్తంగా 3.45 లక్షల మంది బాలికలకు హెచ్‌పీవీ టీకాలను పంపిణీ చేసి, క్యాన్సర్ కట్టడికి చర్యలు చేపట్టింది.

# బండ్ల గణేశ్ కుమార్తె వివాహానికి హాజరైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

**నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె వివాహానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరు**

**నవ దంపతులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి**

**సీఎంతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా హాజరు**

**వేడుకకు హాజరైన పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు**

ప్రముఖ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ కుమార్తె జనని-సూర్యతేజ వివాహ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ వివాహ మహోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా హాజరయ్యారు. వేడుకలో బండ్ల గణేశ్ కుటుంబసభ్యులతో సీఎం రేవంత్ రెడ్డి ఆప్యాయంగా మాట్లాడారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు విచ్చేసి సందడి చేశారు. వారంతా నూతన దంపతులను అభినందించి, ఆశీర్వదించారు. ప్రముఖుల రాకతో వివాహ ప్రాంగణం కోలాహలంగా మారింది. బండ్ల గణేశ్ ప్రతి ఒక్కరినీ సాదరంగా ఆహ్వానిస్తూ కనిపించారు.



# అక్రమ రవాణాలో పుష్పను మించిపోయారు

**గంజాయి కేసులో వెలుగులోకి కీలక విషయాలు**

**డెడ్ డ్రాప్ గంజాయి కేసులోని నిందితుల రిమాండ్ రిపోర్ట్‌లో కీలక విషయాలు**

**గంజాయి కేసులో ఐదుగురుని నిందితులుగా చేర్చిన పోలీసులు**

**సుమారు 29 మంది సరఫరాదారులతో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడి**



హైదరాబాద్ డెడ్ డ్రాప్ గంజాయి కేసులోని నిందితుల రిమాండ్ రిపోర్ట్‌లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ గంజాయి కేసులో ఐదుగురుని నిందితులుగా చేర్చారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి సరఫరా చేసినట్లు అధికారులు గుర్తించారు. సుమారు 29 మంది సరఫరాదారులతో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.ప్రధానంగా 7 మంది సరఫరాదారుల నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. 225 మంది గంజాయి వినియోగదారులను పోలీసులు గుర్తించారు. యూపీఐ చెల్లింపులతో గంజాయి విక్రయాలు జరిగినట్లు దర్యాప్తులో తేలింది. ముఠా సభ్యులు కస్టమర్ల నుంచి ముందుగానే డిజిటల్ పేమెంట్స్ తీసుకున్నట్లు గుర్తించారు. డబ్బులు అందిన తర్వాత మాత్రమే డెడ్ డ్రాప్ ద్వారా గంజాయిని సరఫరా చేస్తున్నారని పోలీసులు తెలిపారు.నిందితులు గంజాయి ప్యాకెట్ ఉంచిన లొకేషన్, ఫొటోలను కస్టమర్లకు షేర్ చేశారు. డెలివరీ చేసిన వ్యక్తికి నిందితులు ప్యాకెట్‌కు రూ.50 చెల్లించారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు వాహనాలు మార్చుతూ గంజాయి సరఫరా చేశారు. దీనిలో భాగంగా 7 ద్విచక్ర వాహనాలు, ఒక కారు వినియోగించినట్లు అధికారులు గుర్తించారు.నిందితుల ఇంట్లోని ఎయిర్‌గన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులపై దాడికి పెంపుడు కుక్కను ఉపయోగించినట్లు ఆరోపణలున్నాయి. పోలీసు అధికారిపై పదునైన వస్తువుతో దాడి చేసి గాయపరిచినట్లు తెలుస్తోంది. పోలీసులపై దాడి ఘటనపై బాలానగర్ పీఎస్‌లో ప్రత్యేకంగా కేసు నమోదైంది.గంజాయి దందాకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు, యూపీఐ లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోంది. గంజాయి ముఠా వెనుక మరింతమంది ఉన్నారా అనే కోణంలోనూ దర్యాప్తు చేపడుతున్నారు. కేసులో ఇతర సరఫరాదారులు, వినియోగదారుల గురించి పోలీసులు ఆరాతీస్తున్నారు.ఏపీలోని పాడేరుకు చెందిన దుర్గాప్రసాద్, కమలాకర్, కిరణ్ అన్నదమ్ములు. కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి బాలానగర్‌లో స్థిరపడ్డారు. వినాయక్‌నగర్‌లోని ఓ ఇంట్లో ఉంటూ కేటరింగ్ కోసం యువకులను పంపిస్తున్నారు. పైకి మాత్రం కేటరింగ్ చేసేవారికి సహకరిస్తున్నా, తెరవెనక మాత్రం గంజాయి దందా సాగిస్తున్నారు. హైదరాబాద్‌లోని బాలానగర్‌లో భారీగా గంజాయి విక్రయాలు జరుగుతున్న సమాచారం రావడంతో ఈగల్ బృందం నాలుగు నెలలుగా నిఘా పెట్టింది. 2022 నుంచి గంజాయి దందా సాగిస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించింది.ఆంధ్ర-ఒడిశా బార్డర్ నుంచి గంజాయిని తీసుకొచ్చి చిన్న పొట్లాలుగా మార్చి వాట్సప్ ద్వారా ఆర్డర్లు తీసుకుంటున్నట్లు గుర్తించారు. ఓల్డ్ ఎయిర్‌పోర్టు రోడ్డులో డెడ్ డ్రాప్ పద్ధతిలో గంజాయి పెట్టి ఫొటోలు, లొకేషన్ పంపించి వినియోగదారులకు పంపించే వారని పోలీసులు తెలిపారు. 40 బృందాలను ఏర్పాటు చేసి, ఈ నెల 11న అర్ధరాత్రి నిందితుల ఇంటిపై ఈగల్ బృందం దాడి చేసింది.అయితే పోలీసులు నిందితుల ఇంట్లోకి వెళ్లగానే పెంపుడుకుక్కలను ఉసిగొల్పారు. కుక్క ఓ కానిస్టేబుల్‌ను కరవగా నిందితులు పోలీసుపై దాడి చేసి పారిపోయేందుకు యత్నించారు. ఇద్దరు పట్టుబడగా మరో నిందితుడు కిరణ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ చేతిపై స్క్రూ డ్రైవర్‌తో దాడి చేసి భవనాలపైకి ఎక్కాడు. సినీ ఫక్కీ తరహాలో ఓ భవనం నుంచి మరో భవనంపైకి దూకుతూ తప్పించుకునేందుకు యత్నించాడు. మూడు అంతస్తుల భవనం పైనుంచి దూకడంతో గాయాలయ్యాయి. పోలీసులు అతడిని పట్టుకొని అదుపులోకి తీసుకొని ఆస్పత్రికి తరలించారు. ఇంట్లో చేసిన సోదాల్లో 14.5 కిలోల గంజాయి, కార్లు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎయిర్ గన్ లభ్యమైనట్లు ఈగల్ ఫోర్స్ వెల్లడించింది.

# పార్ట్‌టైం ఉద్యోగాల పేరుతో మోసాలు

**టాస్క్ ఆధారిత సైబర్ నేరాలపై ‘యుద్ధం’**

**సామాజిక మాధ్యమాల ద్వారా భారీ మోసం**

**ఉద్యోగాలు ఇస్తామంటూ అకౌంట్లలో డబ్బులు లూటీ**

**లైక్, షేర్, సబ్‌స్క్రైబ్ పైనే నడిపిస్తున్న వ్యవహారం**



సామాజిక మాధ్యమాల వినియోగం పెరిగిన కొద్దీ వాటి ద్వారా జరిగే సైబర్ నేరాలు (జఎవతీ జతీఱవం) కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ (ట్విట్టర్), వాట్సాప్ వంటి వేదికలను అసాంఘిక శక్తులు మోసాలకు మాయోపాయంగా వాడుకుంటున్నాయి. ఇటీవలి ఉద్యోగ సంబంధిత మోసాలు సామాజిక మాధ్యమాలలో సాగుతున్నాయి. కేవలం పోస్ట్‌లను ‘లైక్’ చేయడం ద్వారా డబ్బు సంపాదించవచ్చని ఆశ చూపి మోసగాళ్లు బాధితులను ఆకర్షిస్తారు, ఆపై వివిధ రకాల రుసుముల పేరుతో వారి నుంచి డబ్బు వసూలు చేసి మోసం చేస్తారు. ఈ ‘టాస్క్-ఆధారిత సైబర్ నేరాల’ పట్ల అప్రమత్తంగా ఉండాలని విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు ప్రజలను హెచ్చరించారు. అలాగే, ఇటువంటి మోసపూరిత కార్యకలాపాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆయన వారం రోజుల పాటు సాగే ఒక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు.“ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో కనిపించే ప్రకటనలను కేవలం ‘లైక్’ చేసి, వాటికి సబ్‌స్క్రయిబ్ చేసుకోండి మీరు చేయాల్సింది ఇంతే. ఇది చేయండి, మీ జేబులు డబ్బుతో నిండిపోతాయి.”ఆన్‌లైన్‌లో మీరు చూసే ఉత్పత్తులు, హోటళ్లకు సమీక్షలు వ్రాసి, గణనీయమైన మొత్తంలో డబ్బు సంపాదించండి.”“మీకు కొద్దిపాటి కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నా చాలు, ఈ ఉద్యోగం మీదే. పని చేసి బోలెడంత డబ్బు సంపాదించండి.”దఇలాంటి ప్రకటనలతో ప్రజలను తమ వలలో పడేలా ఆకర్షనీయంగా పోస్టులు పెట్టి, అకౌంట్లో ఉన్న డబ్బులు కజేసేందుకు సైబర్ నేరగాళ్లు ప్లాన్ చేస్తారు.ఒక వారం రోజుల పాటు ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించనున్నారు. సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేయడానికి అనుసరించే పద్ధతులపై ముఖ్యంగా రివ్యూలు/రేటింగ్స్, లైక్స్/సబ్‌స్క్రిప్షన్లు, డేటా ఎంట్రీ ఉద్యోగాలు, ఇతర “పార్ట్-టైమ్ జాబ్” పథకాల ద్వారా జరిగే మోసాలపై వివరణాత్మక సమాచారం అందించనున్నారు. ప్రజలు ఈ మోసాల బారిన పడకుండా చూడటమే దీని ముఖ్య ఉద్దేశ్యం.2025-26 కాలంలో ఇప్పటివరకు, చీ= పోలీస్ కమిషనరేట్ పరిధిలో ‘టాస్క్-ఆధారిత’ మోసాలకు సంబంధించిన 160 కేసులు నమోదయ్యాయి. బాధితులు మొత్తం రూ. 2.5 కోట్లు నష్టపోయారు.“సామాజిక మాధ్యమాలలో సింపుల్ టాస్క్ పూర్తి చేయడం ద్వారా రోజుకు వేల రూపాయల ఆదాయం వస్తుందని చెప్పే ప్రకటనలు వస్తే, అది దాదాపు ఒక సైబర్ మోసమేనని గుర్తించాలి. మోసగాళ్లు మొదట్లో కొంత డబ్బును ఆశచూపి, ఆ తర్వాత వివిధ రుసుముల పేరుతో పెద్ద మొత్తంలో డబ్బును వసూలు చేస్తారు. ఇటువంటి పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అనుమానాస్పద లింకులు “డిజిటల్ అరెస్ట్” వంటి నేరాల విషయంలో జాగ్రత్త వహించాలి. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే, వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయడం ద్వారా లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించడం ద్వారా ఫిర్యాదు చేయాలి.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com